కాలినడకే శరణ్యం

- గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కరువు
- వర్షాకాలంలో ఎడ్లబండ్లే దిక్కు
- సకాలంలో అందని విద్యా, వైద్యం



కడెం నది దాటుతున్న గిరిజాయి గిరిజనులు



బురదమయంగా దేద్ర రోడ్డు

బజార్‌హత్నూర్: మండలంలో ఉన్న 26 గ్రామాల లో 17 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు విద్య, వైద్యం సకాలంలో అందడం లేదు. మండల కేంద్రం నుంచి రేషన్ సరుకులు, వ్యవసాయానికి విత్తనాలు, ఎరువులు, పండించిన పంటను అమ్ముకోవడానికి, ఇతర అవసరాలకు రవాణ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎలాంటి సౌకర్యం లేక గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి.

ఎడ్ల బండ్లే రవాణ సౌకర్యం..

మండలంలో గిరిజాయి, దేద్రా, మాన్కపూర్, ఉమర్ద(బి), గోసాయి ఉమర్ద, ఇంద్రనగర్, బద్దునాయక్ తండా, హర్కాయి, చిన్నుమీయ తండా, రాజుల గూడ, రతన్‌గూడ, కిన్నరపల్లి, కొత్తపల్లి, బంద్రేవ్, చింతకర్ర, తుకాన్‌పల్లి, జల్లుగూడ, గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. ఈ గ్రామాలు ఆవిర్భవించి 70 ఏళ్లు అవుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మాత్రం నిర్మించడం లేదు. ప్రజలు 8 కిలో మీటర్లు కాలినడకన, లేదా ఎడ్ల బండ్లపై అడవి గుండా వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాలు పడితే సైకిల్ కూడా వెళ్లలేని దుస్థితి. ఎవరైనా అనారోగ్యానికి గురైతే మండల కేంద్రానికి రావడానికి ఎడ్ల బండ్లే దిక్కు.

విద్యా, వైద్యానికి దూరం..

వర్షాకాలం నాలుగు నెలలు కడెం నది దాటిగా ప్రవహిస్తూనే ఉంటుంది. వర్షాలకు మట్టిరోడ్లు బురదమయం కావడంతో వాహనాల రాకపోకలు ఉండవు. వాగులు పొంగి పొర్లడంతో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు గ్రామాలకు రాకపోకలు కొనసాగించడం గగనమే. దీంతో గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. నేటి ఆదునిక యుగంలో ఇంత దుర్భర జీవితం గడుపుతున్న గిరిజనులను ఏ నాయకుడు పట్టించుకోవటం లేదు. ప్రజలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వంతెన, రోడ్డు నిర్మాణం చేసి రవాణ సౌకర్యం కల్పించాలి.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మా గ్రామంలో ఉన్నత పాఠశాల లేదు. గ్రామం నుంచి భూతాయి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. నది దాటేందుకు వంతెన లేదు. గత వర్షాకాలంలో ముగ్గురు రోగులు వాగు దాటించలేక చనిపోయారు. మా గ్రామాలకు అత్యవసరంగా వంతెన, రోడ్డు సౌకర్యం కల్పించాలి.

కుమ్ర సంగీత, మాజీ సర్పంచ్ గిరిజాయి

కాలినడకన వెళ్లాల్సిందే



మా గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీకి 8– 10 కిలోమీటర్లు కాలినడకను అడవి గుండా వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాలు పడితే సైకిల్ కూడా వెళ్లాదు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఎడ్ల బడ్లను వినియోగిస్తాం. ఎన్ని ప్రభుత్వాలు మారిన రోడ్డు సౌకర్యం కల్పించలేదు.

– ప్రియాంక, మాజీ సర్పంచ్, మాన్కపూర్

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కరంజి(టి)లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తాంసి: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని కరంజి(టి)లో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సవారీబంగ్లాలో పీరీల వద్ద స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను సైతం పరామర్శించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ నాగయ్య, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, నరేందర్, కేదారేశ్వర్ రెడ్డి, లింబాజీ, కల్చప్ యాదవ్, నితిన్, షేక్ అఫ్రోజ్, గంగయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో రేషన్ దుకాణాలు

నేరడిగొండ: మండల ప్రజలకు అందుబాటులో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలో దూర ప్రాంతాల ప్రజలు రేషన్ సరుకులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడటాన్ని గమనించి సంబంధిత అధికారులతో మాట్లాడి నూతనంగా మండలంలో తొమ్మిది రేషన్ షాపులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. కుంటాల(కె), నాగమల్యాల్, తిమ్మాపూర్, పీచర, లక్ష్మీపూర్, గోవింద్‌పూర్, బుద్ధికొండ, రాజులతండా, ఆరెపల్లిలలో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇకనుంచి వారి వారి గ్రామాల్లో రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు. నూతనంగా రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పీరీల సందడి



ఇచ్చోడలో పీరీల సందడి



పీరీలతో భక్తులు

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా పీరీలను ఊరేగించారు. మండలంలో కామాగిరి, బోరిగామ, ఇచ్చోడ, దుబార్‌పేట్, కోకసమన్నూర్, సాథ్‌నంబర్, దేవుల్‌నాయక్ తండా గ్రామాల్లో పీరీలతో సందడి చేశారు. మరో ఐదు రోజుల పాటు ఈ వేడుకలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గోండుగూడ, హర్కపూర్, ముత్నూర్, వాడగం, వల్లగోండ, కేస్లాపూర్, భగత్సింగ్ నగర్ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఏడో రోజు డోలా, పీరీలను గ్రామాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చంద్రకళా వాఘ్మరేకు ఘన నివాళి

ఆదిలాబాద్‌రూరల్: రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం మాజీ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళా వాఘ్మరే గత 13 రోజుల కిందట మృతి చెందారు. ఆదివారం సంజయ్‌నగర్ కాలనీలో నిర్వహించిన శ్రద్ధాంజలిలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా గౌతమ బుద్ధుని, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధ వందన, పరిత్రాన్ పాట్ పూజ బౌద్ధ గురువు ఆర్యా సంఘ మిత్ర ద్వారా నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్, భారతీయ బౌద్ధ మహా సభ కేంద్ర శిక్షక్ యువరాజ్ మోరే, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఠల్, దయానంద్ గైక్వాడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: ఆర్కిటెక్ ఇంజనీర్స్ అండ్ ఎల్బీపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం యోగా భవన్‌లో ఎన్నుకున్నారు. ఇంజనీర్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడిగా అన్నదానం జగదీశ్వర్‌ను మరోసారి ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రవూఫ్, కోశాధికారిగా మాటేటి రాజు, ఉపాధ్యక్షుడిగా బేర శ్రీనివాస్, సయ్యద్ సాబిర్ అలీ, సంయుక్త కార్యదర్శులుగా సుశాంత్, అల్మాస్ ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు సురేశ్, రమణరెడ్డి, లక్ష్మణ్‌లను, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు పుట్ట శేఖర్, బాపురావ్‌లకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, గ్రామస్తులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, రవి, రమేశ్, మురళీమోహన్, రఘన్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా వేయాలి

బోథ్: డీఎస్సీ వాయిదా వేయాలని బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మేడిచెల్మ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు డీఎస్సీ తేదీని మార్చి సమయం ఇవ్వాలని కోరినా.. సీఎం రేవంత్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. నిరుద్యోగులు చదవడానికి వారికి సమయం లేదని, వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న బలరాం జాదవ్

జైనథ్: మండలంలోని మేడిగూడ గ్రామానికి చెందిన ఇటీవలే మరణించిన మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన ముక్తార్ తల్లి మృతి చెందగా.. వారి కుటుంబసభ్యులను సైతం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ పోత రెడ్డిని సైతం పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎదులాపురం: అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి పొందుతున్న సీపీఐ నా యకులు అరుణ్‌కుమార్‌ను ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో సీపీఐ నాయకులు రాములు, కృష్ణ స్వామి, నర్సింగరావు ఉన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని పూజారి శంకర్ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకులు సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ వార్డు సభ్యుడు చిలుక రాకేశ్ తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

గుంతల రోడ్డుతో ఇబ్బంది

బేల: మండలంలోని 353బీ జాతీయ రహదారి మార్గంలో నగ్‌రాల క్రాస్ నుంచి చప్రాల గ్రామానికి వెళ్లే పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బాధ్యతతో పనిచేసిన వారికే గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బాధ్యతతో పనిచేసిన వారికే సమాజంలో గుర్తింపు ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీకి చెందిన రూపావత్ ఫకీర్‌దాస్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఫకీర్‌దాస్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యనేర్పి వారికి ఉన్నతమైన స్థానాలకు చేర్చడం ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గాడ్గే సుభాష్, మహేందర్‌రెడ్డి, సాబీర్, గణేష్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణకు హాజరైన మహిళలు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాయివైకుంఠ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్ అన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని 200 మంది మహిళలకు ఎంబ్రైడరీ, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు శిక్షణ పొంది కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు విజయ్ బాబు, గట్టయ్య, భీమన్న, సిబ్బంది శ్రావణి, పూజ, వీణా, మీన, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కస్తూర్బా భవన నిర్మాణం

- ఇరుకు గదులతో విద్యార్థుల ఇబ్బందులు
- పట్టింపులేని అధికారులు



కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కొనసాగుతున్న పనులు

బేల: బాలికలు ఉన్నత చదువులకు దూరం కాకుండా ఉండేందుకు హాస్టల్ సౌలభ్యంతో ఇంటర్ విద్య అందించేందుకు 2022– 23 సంవత్సరంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ తరగతులను ప్రారంభించారు. ఈక్రమంలోనే ఈ తరగతుల నిర్వహణ కోసం నూతన తరగతి గదుల భవన నిర్మాణం కోసం సమగ్ర శిక్ష అభియాన్ కింద నిధులు రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది ఆగస్టు 30న ఈ తరగతుల గదుల భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. పనులు ఒక నెల ఆలస్యంగా ప్రారంభమై.. పది నెలలుగా కొనసాగుతున్నాయి. భవన నిర్మాణ పనులు ఇప్పటిదాకా సగం కూడా పూర్తి కాలేదు. దీనిపై సంబంధిత విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కస్తూర్బాలో ఇంటర్ విద్య కోసం..

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్య కోసం 2022–23 విద్యా సంవత్సరంలో ఒక్కొక్క గ్రూపులో 40 విద్యార్థులతో ఎంపీపీ, బైపీసీ గ్రూపుల్లో ఫస్టియర్‌తో తరగతులు ప్రారంభించారు. అప్పటికే ఉన్న పాత భవనంలోని కంప్యూటర్ ల్యాబ్, డార్‌మెంటరీలలో ఇంటర్ తరగతుల నిర్వహణ ప్రారంభమైంది. మొత్తంగా 160 మంది ఇంటర్ అదనపు విద్యార్థులతో పాత భవనంలోనే ఇబ్బందుల మధ్య తరగతులు, హాస్టల్ నిర్వహణ కొనసాగుతోంది.

పది నెలలుగా తరగతి గదుల నిర్మాణం..

అనువైన సరిపడా స్థలం లేకపోవడంతో ముందు భాగంతో పాటు ఎడమవైపు ఉన్న 35 మీటర్ల మేర ప్రహరీని కూల్చేశారు. ఆ తర్వాతే నూతన భవన నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ ప్రారంభించారు. గత పది నెలలుగా ఇక్కడ తరగతి గదులు, డార్‌మెంటరీ, సౌకర్యాలతో 14 గదుల నిర్మాణంతో మూడు అంతస్తుల్లో భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇటీవల గోడల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ఈ భవనంలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. సంబంధిత శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆడపా, దడపా పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి, భవన నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బంగారుగూడ కాలనీలో నివాసం ఉంటున్న మాదిగ కులస్తులపై నాలుగు రోజుల కిందట జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు అన్నారు. ఆదివారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 8 మంది మాదిగ కులస్తులపై దాడి జరిగగా.. అందులో నలుగురు మహిళ బాధితులు ఉన్నారన్నారు. కొంతమంది రౌడీ మూకల్లాగా ఏర్పడి అకారణంగా దాడి చేయడం సరికాదన్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుడాల స్వామి మాదిగ, కాంబ్లే బాలాజీ, అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్, ఓం ప్రకాష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులను దీపాయిగూడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల్లో పనిచేస్తూ.. ఇటీవలే పదోన్నతి పొందిన పలువురు ఉద్యోగులను సంఘం సభ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

బోథ్: వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన దేవుల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన రాథోడ్ బాబూలాల్ దంపతులను జై సేవాలాల్ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైద్యారోగ్య శాఖలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని బాబూలాల్ పేర్కొన్నారు.

సిరికొండ: గత 30 సంవత్సరాలుగా పోస్ట్‌మాన్‌గా సేవలందిస్తున్న సిరికొండ పోస్ట్‌మాన్ కోత్తురి పోషన్న బదిలీపై వెళ్తున్న సందర్భంగా సిరికొండ యువసేన సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలు అందించి, బాధ్యతగా, అంకితభావంతో పని చేసి బదిలీపై వెళ్లడం చాలా బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, సభ్యులు మల్లేష్, గంగాధర్, సాయికృష్ణ, నరేశ్, రవి, దత్తు, మహేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో గ్రామ పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కాలనీలో ఖాళీ స్థలాలల్లో పెరిగిన పిచ్చి మొక్కలను ఆదివారం జేసీబీతో తొలగించారు. తొలగించే క్రమంలో పాములు బయటపడ్డాయి. స్థానికులు పాములను చంపి వేశారు. కాలనీలో ఉన్న పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నోసార్లు గ్రామపంచాయతీ వారికి మొర పెట్టుకుంటే జేసీబీతో తొలగిస్తున్నారని జక్కుల వెంకటేశ్ అన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) జిల్లా నాయకులు వెంకట్ నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవనంలో ఆదివారం మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకం కింద బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4 వేలు అందించాలన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలన్నారు. రాజీనామా చేసిన కార్మికులందరికీ రూ. 10 వేల పెన్షన్ అందించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాలో బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజవయంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు కళావతి, గంగమ్మ, తారా బాయి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ వస్తుందా.. అవ్వ



కరంజి(టి)లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాంసి: అవ్వ ఎలా ఉన్నావు.. ఆరోగ్యం బాగుందా.. కొత్త పింఛన్ వస్తుందా అంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వృద్ధులను ఆప్యాయంగా పలుకరించారు. ఆదివారం భీంపూర్ మండలంలోని కరంజి(టి)లో పర్యటించిన ఎమ్మెల్యే గ్రామంలో ఆరుబయట కూర్చున్న వృద్ధుల వద్దకు వెళ్లి మాట్లాడారు. కొత్త పింఛన్ వస్తుందా అని అడగగా.. గత ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ వస్తుందని వృద్ధురాలు సమాధానం ఇచ్చింది.

బోనాల పండగలో పాల్గొన్న దుర్గం శేఖర్



బోనాల వేడుకలో దుర్గం శేఖర్

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో ఆదివారం జరిగిన బోనాల పండగ వేడుకల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దుర్గం శేఖర్ పాల్గొన్నారు. బోనాల పండగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లమ్మ బోనాలను ఎత్తుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుభీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

కులగణన సాధన యాత్రలో జిల్లా నేతలు



జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: సమగ్ర కుల గణన సాధన యాత్ర ఆదివారం కామారెడ్డి నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌తో పాటు పలువురు బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.